

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం

16 సెప్టెంబర్ 2025 పేజీలు : 08


## ట్రాక్టర్‌ను నడిపిన కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :**

నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం సమీపంలోని వెహికల్ షెడ్‌ను సోమవారం తనిఖీ చేశారు. షెడ్డులో జరుగుతున్న వాహనాల మరమ్మతు పనులను పర్యవేక్షించారు. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్య నిర్వహణకు నూతనంగా కొనుగోలు చేసిన ట్రాక్టర్ వాహనాన్ని కమిషనర్ పరిశీలించి, వాహనం సామర్ధ్యాలను అడిగి తెలుసుకున్నారు. వాహన పనితీరును తెలుసుకునేందుకు షెడ్డు ప్రాంగణంలో కమిషనర్ నూతన ట్రాక్టర్‌ను స్వయంగా నడిపి పరిశీలించారు.



## జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన డా.అజిత వేజెండ్ల

**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :**

జిల్లా పోలీస్ కార్యాలయంలో శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నూతన ఎస్పీగా డాక్టర్ అజిత వేజెండ్ల సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. సాధారణ బదిలీలలో భాగంగా వైజాగ్ డీసీపీ నుండి నెల్లూరు జిల్లా ఎస్పీగా విచ్చేసినట్లు వివరించారు. 2015 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన తాను గత పది సంవత్సరాలు రంపచోడవరం ఏఎస్పీగా, రాజమండ్రి ఏఎస్పీగా, విజయవాడ డీసీపీగా, గోదావరి ఎస్పీగా, విశాఖపట్నం డీసీపీగా, అదేవిధంగా గ్రేహౌండ్స్‌లో మంగళగిరి బెటాలియన్, అనంతపురం

మిగతా 2

## రౌడీలపై దృష్టి సారిస్తాం

**నెల్లూరు బ్యూరో, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లాలో రౌడీలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే శక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని నెల్లూరు నూతన ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ అజిత వేజెండ్ల అన్నారు. సోమవారం ఆమె పోలీస్ కార్యాలయంలో ఎస్పీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నెల్లూరు జిల్లా ఎంతో ప్రశాంతమైన జిల్లాగా పేరుగాంచిందని, అలాంటి జిల్లాలో తాను ఎస్పీగా బాధ్యతలు నిర్వహించడం గర్వంగా ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, డిజిపి హరీష్ కుమార్ గుప్తాకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో పోలీసు అధికారులతో సమన్వయం చేసుకొని ప్రజాప్రతినిధుల సహకారంతో శాంతి భద్రతల పర్యవేక్షణలో రాజీలేని విధంగా బాధ్యతలు నిర్వహిస్తామన్నారు. తనను ఏ సమయంలోనైనా సంప్రదించవచ్చని, ప్రజలకు సైతం అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు డిఎస్పీలు, సిఐలు పుష్పగుచ్చాలు ఇచ్చి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఎస్పీని కలిసిన నవాబుపేట సీఐ



**నెల్లూరు అర్బన్/క్రైమ్ :** జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అజిత వేజెండ్లను నెల్లూరు నగర టూటౌన్ నవాబుపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.వేణుగోపాల్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసి మొక్కను అందజేశారు.

## సోమిరెడ్డి 'ఎస్' ట్యాక్స్ దారుణం

**జిల్లా వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడు నాగార్జున విమర్శ**

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**



సర్వేపల్లిలో ఏ అభివృద్ధి పని జరిగినా.. అక్రమ తవ్వకాలు జరిగినా.. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి 'ఎస్' ట్యాక్స్‌ను భారీగా విధిస్తారని నెల్లూరు జిల్లా వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడు ఊటుకూరు నాగార్జున విమర్శించారు. సోమవారం నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాకాణి గోవర్ధన్ రెడ్డి సర్వేపల్లిలో జరుగుతున్న అన్యాయాలు, దుర్మార్గాలను ప్రశ్నిస్తే, సమాధానం చెప్పలేక సోమిరెడ్డి, సోమిరెడ్డి పెయిడ్ ఆర్టిస్టులు గోవర్ధన్‌రెడ్డి గురించి మాట్లాడుతూ అయోమయ పరిస్థితులు సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. గోవర్ధన్ రెడ్డి కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న దుర్మార్గాలను, దౌర్జన్యాలను ప్రజలకు వివరిస్తూ, ప్రజల తరపున పోరాటం చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి

-మిగతా 2లో

## పీజీఆర్ఎస్ అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

**జాయింట్ కలెక్టర్ కె కార్తీక్**

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :**



ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజలు అందిస్తున్న అర్జీలను జాప్యం లేకుండా సకాలంలో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జాయింట్ కలెక్టర్‌తోపాటు డిఆర్‌వో విజయకుమార్, జడ్పీ సిఇవో మోహన్‌రావు, డ్వామా పీడీ గంగా భవాని, డీపీఓ శ్రీధర్‌రెడ్డి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను వెంటనే పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా భూసమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు. ప్రతి అర్జీని కూడా క్షుణ్ణంగా పరిశీలించి ప్రజలు సంతృప్తి చెందేలా నిర్దిష్ట గడువులోగా నాణ్యమైన పరిష్కారం చూపించాలని, పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్జీదారులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వశాఖల జిల్లాస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం

## జిల్లా ఎస్పీ డా.అజిత వేజెండ్ల



**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :** జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నూతన జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల సోమవారం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదుదారులతో ఎస్పీ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో 90 ఫిర్యాదులు స్వీకరించినట్లు ఎస్పీ తెలియజేశారు. ప్రజా ఫిర్యాదుల పట్ల అలసత్వం ఉండరాదని, ప్రజలతో జవాబుదారీగా వ్యవహరించి పిటీషన్లను పరిష్కరించాలని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి చట్టప్రకారం విచారణ జరిపి న్యాయం జరిగే విధంగా పరిష్కరించాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఈ సందర్భంగా ఆదేశించారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ సిహెచ్ సౌజన్య, మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పి కె.సిహెచ్ రామారావు, లీగల్ అడ్వైజర్ టీ.శ్రీనివాసులురెడ్డి, ఎస్‌బీ డీఎస్పీ శ్రీనివాసరావు, ఉమెన్ పీఎస్ సీఐ సుబ్బారావు, ఎస్‌బీ సీఐ-1 వెంకటేశ్వరరావు, ఎస్‌బీ సీఐ-2 శ్రీనివాస్ రెడ్డి, కంప్లయింట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

**వచ్చిన ఫిర్యాదుల్లో కొన్నిలా..**

⦿ అల్లూరు పరిధికి చెందిన వ్యక్తిని, హైదరాబాద్ కు చెందిన మాడిశెట్టి నిఖిల్ అనే వ్యక్తి డ్రగ్ ఇన్స్పెక్టర్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి 34 లక్షల 88 వేల నగదు తీసుకొని ఉద్యోగం ఇప్పించకుండా నగదు తిరిగి ఇవ్వకుండా బెదిరిస్తున్నాడని, అదేవిధంగా కోవూరు పరిధికి చెందిన వ్యక్తిని ప్రొద్దుటూరుకు చెందిన చంద్రశేఖర్ రెడ్డి అనే వ్యక్తి సాఫ్ట్‌వేర్ జాబ్ ఇప్పిస్తానని 3.50 లక్షల నగదు తీసుకొని జాబు ఇప్పించకుండా నగదు తిరిగి ఇవ్వకుండా మోసం చేశాడని విచారించి న్యాయం చేయాలని కోరారు.

⦿ చిన్న బజారు పరిధికి చెందినటువంటి మహిళను కోటమిట్టకు చెందిన కాలేశా, గౌస్ బాషా అనే ఇద్దరు కలిసి గత మనస్పర్ధలను మనసులో పెట్టుకుని కొట్టి గాయపరిచారని, విచారించి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

⦿ బుచ్చి పరిధికి చెందినటువంటి మహిళను, తన భర్త శివకుమార్‌తో విడాకులు తీసుకున్నట్లు అయినా కూడా తాగి ఇంటికి వచ్చి వేధిస్తున్నట్లు, గతంలో తీసుకున్న ఆమె యొక్క వ్యక్తిగత ఫోటోలు సోషల్ మీడియాలో అప్లోడ్ చేస్తానని బెదిరిస్తున్నాడని, విచారించి న్యాయం చేయాలని కోరారు.

⦿ వేదాయపాలెం పరిధికి చెందిన వృద్ధుడు తన పేరు మీద ఆస్తిని అందరికీ వాటాలు పంచిన తర్వాత, తన జీవనోపాధి కొరకు ఉంచుకున్న ఆస్తిని తన చిన్న కుమారుడు రవి కుమార్ తన బాగోగులు చూసుకోకుండా, ఆస్తిని అమ్ముకోనివ్వకుండా దౌర్జన్యం చేస్తున్నాడని, జీవనోపాధి కూడా కష్టంగా ఉందని విచారించి న్యాయం చేయాలని, అదేవిధంగా దగదర్తి పరిధికి చెందిన వృద్ధురాలిని తన పెద్దకొడుకు అతని భార్య తన బాగోగులు చూసుకోకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఇంటికి వెళ్లే దారిని కూడా అడ్డగించి ఇబ్బంది పెడుతున్నారని విచారించి న్యాయం చేయాలని కోరారు.

⦿ విడవలూరు పరిధికి చెందినటువంటి మహిళను, తన భర్త అధిక కట్నం కోసం శారీరకంగా మానసికంగా వేధిస్తున్నాడని, రెండో పెళ్లికి సిద్ధమైతే అడిగినందుకు బెదిరిస్తున్నాడని ఇంటి నుంచి గెంటివేశాడని విచారించి న్యాయం చేయాలని, కౌన్సిలింగ్ నిర్వహించి కుటుంబాన్ని చక్కదిద్దాలని కోరారు.

⦿ ఆత్మకూరు పరిధికి చెందిన వ్యక్తి యొక్క కుమార్తె ఓ ప్రైవేట్ కళాశాలలో ఉద్యోగం చేస్తున్నట్లు, గతవారం ఉద్యోగానికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదని, తన కుమార్తె ఆచూకీ కనుగొని అప్పగించాలని కోరారు.

# జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన డా.అజిత వేజెండ్ల

*(మొదటి పేజీ తరువాయి)*




బెటాలియన్‌లలో సేవలు అందించినట్లు వెల్లడించారు. జిల్లా ప్రజల సహకారంతో వారి ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా 24×7 ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలియజేశారు. శాంతి భద్రతలు, నేర నియంత్రణ, నేర పరిశోధన, మహిళల సంరక్షణ, ట్రాఫిక్, రోడ్డు ప్రమాదాల నివారణ తదితర అంశాలపై ప్రధాన దృష్టి సారించి తదనుగుణంగా కార్యచరణ రూపకల్పన చేస్తున్నట్టు తెలిపారు. నేటి ఆధునిక సమాజంలో మారుతున్న సాంకేతికతను బట్టి సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సైబర్ ఫ్రాడ్ జరిగినట్లయితే వెంటనే నిర్భయంగా వచ్చి పోలీసు వారిని ఆశ్రయించాలని, ఆందోళన చెందకుండా సకాలంలో స్పందిస్తే పూర్తి న్యాయం జరుగుతుందని ఆమె వెల్లడించారు. జిల్లాలో మహిళల రక్షణ కోసం పటిష్టమైన చర్యలు చేపడతామని, మహిళలు, బాలికల పట్ల జరుగుతున్న నేరాల నియంత్రణకు కృషి చేస్తామని, శక్తి టీం వ్యవస్థను బలోపేతం చేసి మహిళల పట్ల, విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించే వారి పట్ల అత్యంత కఠినంగా వ్యవహరించడంతోపాటు చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, రౌడీ షీటర్స్, నేర చరిత గల నేరస్తులపై నిరంతర ప్రత్యేక నిఘా పెడుతున్నట్లు, చట్టానికి ఎవరు అతీతులు కారని, చట్టాలకు లోబడి ఉండాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. అంతేకాకుండా ఈగల్ బృందం సమన్వయం చేసుకొని గాంజా, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలను పూర్తిగా అరికట్టుటకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం మరింత పెంపొందించే విధంగా సమర్థవంతంగా సేవలు అందించేందుకు ప్రణాళికలు చేపడుతున్నామని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అన్నివిధాల చర్యలు తీసుకుంటున్నామని ఆమె స్పష్టం చేశారు. విజిబుల్ పోలీసింగ్ ఉండేలా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు, అసాంఘిక కార్యకలాపాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరిస్తామని, నేర నియంత్రణకు బీట్ వ్యవస్థను మరింత పటిష్టం చేస్తామని వెల్లడించారు. కళాశాలలు, పాఠశాలలో శక్తి టీమ్స్, మహిళా పోలీసులు, మీడియా సహకారంతో ఫోక్సో వంటి చట్టాలు, శిక్షల గురించి విస్తృతంగా అవగాహన కల్పిస్తామని, ప్రతి ఏరియాలో జరుగుతున్న నేరాలను తెలుసుకొని వాటి నియంత్రణకు చర్యలు చేపడతామని, ప్రజలందరికీ అండగా ఉంటూ ముందుకు వెళ్తామని వెల్లడించారు. అదేవిధంగా తమ సిబ్బంది సహకారమే తనకు బలమని, పోలీసులు.. వారి కుటుంబాల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, జిల్లా పోలీసులలో వృత్తి నైపుణ్యత పెంచేవిధంగా ప్రణాళికలు రూపొందిస్తామని, కమ్యూనిటీ పోలీసింగ్‌ను బలపరుస్తామని ఎస్పీ వెల్లడించారు. ప్రజలు మీడియా మిత్రుల స్నేహపూర్వక సహకారం ఎంతో అవసరమని, సమన్వయంతో ముందుకు వెళ్దామని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ అజిత వేజెండ్ల తెలియజేశారు. అనంతరం అడిషనల్ ఎస్పీ సిహెచ్ సౌజన్య, సబ్ డివిజన్, ఎస్‌బి, డిసిఆర్‌బి, ఏఆర్, హెచ్‌జి, పోలీస్ సిబ్బంది కలిసి ఎస్పీకి శుభాకాంక్షలు తెలియజేశారు.

## సోమిరెడ్డి 'ఎస్' ట్యాక్స్ దారుణం

*(మొదటి పేజీ తరువాయి)*

ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకునేందుకు ప్రజలతో కలిసి నడుస్తున్నారన్నారు. సోమిరెడ్డి అవినీతి సంపాదనకు అడ్డు వస్తున్నారని అక్రమ కేసులు పెట్టి, 86 రోజులు జైలులో ఉంచారని తెలిపారు. కూటమి గాలిలో గెలిచిన 164 మంది శాసనసభ్యుల్లో మొదటి వాడు సోమిరెడ్డి అన్నారు. ఐదుసార్లు ఓడిపోయి, రాజకీయాలు చాలించుకునే సమయంలో గాలివాటంగా గెలిచినవాడు సోమిరెడ్డిని చెప్పారు. నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి ఇంటిపై దాడి చేస్తే, ఖండించని స్వార్థపరుడు సోమిరెడ్డిని పేర్కొన్నారు. గెలిచిన రోజు నుండి ప్రజల గురించి ఆలోచన చేయకుండా, అక్రమ సంపాదనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాడని, కోట్లు గడిస్తూ.. సర్వేపల్లిని సర్వనాశనం చేస్తున్నాడని ఆరోపించారు. సోమిరెడ్డి, సోమిరెడ్డి కొడుకు **'ఎస్'** ట్యాక్స్ పేరిట ఏ కంపెనీ వదలకుండా దండుకుంటున్నారని విమర్శించారు. ఆఖరికి సర్వేపల్లి నియోజకవర్గంలో **'టీ'**షాపు పెట్టాలన్నా సోమిరెడ్డికి, సోమిరెడ్డి కొడుకుకు **'ఎస్'** ట్యాక్స్ కట్టకుండా పెట్టేందుకు లేని పరిస్థితులు ఉన్నాయన్నారు. ఇరిగేషన్ పనుల నుండి చిన్న చిన్న పనులలో కూడా కక్కుర్తి పడుతున్న వ్యక్తి సోమిరెడ్డి అన్నారు. సోమిరెడ్డి అన్యాయాలను మా నాయకుడు గోవర్ధన్ రెడ్డి ప్రశ్నిస్తే, జైలుకు వెళ్లారని అవహేళనగా మాట్లాడటాన్ని తాము ఖండిస్తున్నమని చెప్పారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపినంత మాత్రాన తమ నాయకుడు గోవర్ధన్ రెడ్డిని ప్రజల నుండి విడదీయలేరని ఇప్పటికైనా అర్థం చేసుకోవాలన్నారు. గోవర్ధన్ రెడ్డి నాగంబుట్ల వారి కండ్రిక గ్రావెల్ తవ్వకాలు అనుమతులు చూపించమంటే, చూపించలేక గోవర్ధన్ రెడ్డి గురించి నోటికి వచ్చినట్లు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. సోమిరెడ్డికి నీతి, నిజాయితీ ఉంటే గోవర్ధన్ రెడ్డి అడిగిన అనుమతులు చూపించాలని కోరారు.

## ఘనంగా గలేఫ్ ఉత్సవం



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన ఏఎస్ పేటలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ హజరత్ సయ్యద్ ఖాజా రహమతుల్లా నాయబ్ రసూల్ వారి 252వ గంధం మహోత్సవంలో భాగంగా ఫకీర్ సాహెబ్ గలేఫ్ ఉత్సవాన్ని ఆదివారం రాత్రికి ఘనంగా నిర్వహించారు. గలేఫును ఫకీర్ సాహెబ్ వంశస్తుడైన మొగల్ షానవాజ్ ఇంటి నుండి భక్తి కీర్తనలతో పకీరుల జరాబులతో మేళ తాళాలతో బానాసంచా కాలుస్తూ దర్గా ఈవో షేక్ మొహమ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఊరేగింపుగా తీసుకువచ్చి దర్గాలో చేర్చారు. హజరత్ అమ్మవార్ల సమాధులపై దుప్పట్లు కప్పి పూల చెద్దర్లు ఎక్కించారు. ఈ సందర్భంగా దర్గా సజ్జాదా నషీన్ ఎస్‌జిఎన్ హఫీజ్ పాషా ప్రత్యేక ప్రార్థనలు చేసి దువా చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు. గలీఫ్ ఉత్సవాన్ని తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో దర్గా వంశస్థులు, దర్గా సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పలువురు అధికారులకు ఎంపీడీవోలుగా పదోన్నతులు

**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** పలువురు అధికారులకు ఎంపీడీవోలుగా పదోన్నతులు కల్పిస్తూ జడ్పీ సీఈవో జె.మోహన్‌రావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి జిల్లాలో డిప్యూటీ ఎంపీడీవోలుగా పనిచేస్తున్న ఎస్.ఉమామహేశ్వరావును తిరుపతి జిల్లా చిట్టమూరు ఎంపీడీవోగా, సిహెచ్ రవీంద్రబాబును దక్కిలి ఎంపీడీవోగా, నెల్లూరు జిల్లాలో డిప్యూటీ ఎంపీడీవోగా ఉన్న ఎం.సాయి ప్రసాద్, డి.నారాయణ, ఎం. నారాయణరెడ్డి, ఎల్.చెంచమ్మలను తిరుపతి జిల్లా వాకాడు, బాలాయపల్లి, ఓజిలి ఎంపీడీవోలుగా పదోన్నతులు కల్పించి బదిలీ చేశారు. ప్రకాశం జిల్లాలో డిప్యూటీ ఎంపీడీవోలుగా ఉన్న టి.సుకుమార్, ఎంవి మోహన్ రెడ్డి, బి.శ్రీనివాసులు, ఎంవి రమణమ్మను తిరుపతి జిల్లా సూళ్లూరుపేట ఎంపీడీవోగా, నెల్లూరు జిల్లా సైదాపురం ఎంపీడీవోగా, ఉదయగిరి ఎంపీడీవోగా, నెల్లూరు రూరల్ ఎంపీడీవోగా పదోన్నతి కల్పించి బదిలీ చేశారు. నెల్లూరు, ఒంగోలు జిల్లాలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌లుగా ఉన్న ఏ.శైలజ, డివి రమణారెడ్డిలను నెల్లూరు జిల్లా కలువాయి, వరికుంట పాడు ఎంపీడీవోలుగా పదోన్నతి కల్పించి బదిలీ చేశారు. బాపట్ల జిల్లాలో డిప్యూటీ ఎంపీడీవోగా ఉన్న అలీషా బాబును నెల్లూరు జిల్లా చేజర్ల ఎంపీడీవోగా పదోన్నతి కల్పించి బదిలీ చేశారు.

# బస్ షెల్టర్లను వెంటనే ఆధునికరించండి : సీపీఎం



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలంలోని 18 గ్రామాలలో గతంలో నిర్మించిన బస్ షెల్టర్లను వెంటనే ఆధునీకరించాలని కోరుతూ సీపీఎం నెల్లూరు రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆఫీసులోని జడ్పీ సీఈవోకి వినతిపత్రం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆలూరు తిరుపాలు మండల కార్యదర్శి పుడిపర్తి. జనార్ధన్ లు మాట్లాడుతూ.. నెల్లూరు రూరల్ మండలంలో కొండ్లపూడి, దొంతాలి,సజ్జాపురం, కాకుపల్లి, కలివేలపాలెం గ్రామాలలో ఉన్న షెల్టర్‌లను పడగొట్టి ఇంతవరకు నిర్మించలేదని. దీనితో బస్సులలోను, ఆటోలలోను ప్రయాణించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారనీ తెలియజేశారు. అదేవిధంగా పొట్టేపాలెం, ములుమూడి, సౌత్ మోపూరు, కందమూరు, పాత వెల్లంటి, కొత్త వెల్లంటి,సజ్జాపురం, గొల్ల కందుకూరు, గ్రామాలలోని ప్రయాణికుల కోసం నిర్మించిన షెల్టర్లు పూర్తిగా పాడుబడి పోయి కుక్కలకు, మందుబాబులకు నిలయాలుగా మారినవి.ప్రయాణికులు ఏమాత్రం కూర్చునేందుకు కూడా అవకాశం లేని పరిస్థితుల్లో ఉన్నాయి. సౌత్ మోపూర్‌లో గవర్నమెంట్ కాలేజీ, కెనరా బ్యాంక్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉన్నందువల్ల ఎక్కువ మంది ప్రయాణికులు ఈ గ్రామానికి ప్రయాణిస్తుంటారు. హాస్పిటల్ కి వచ్చే పేషెంట్లు కూడా కనీస వసతులు లేక ఇబ్బంది పడుతున్నారు. అలాగే జొన్నవాడ రోడ్డులోని బస్ షెల్టర్ దెబ్బతినందువల్ల ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన జొన్నవాడ కామాక్షితాయిని దర్శించుకునేందుకు వస్తున్న భక్తులు ఆటోల కోసం బస్సుల కోసం ఎండలోనే నిల్చోవలసిన పరిస్థితులు ఉన్నాయి. కాబట్టి మండలంలోని దెబ్బతిన్న బస్ షెల్టర్లను వెంటనే ఆధునికరించి మండలంలోని ప్రజలకు అందుబాటులోకి తేవలసినదిగా సిపిఎం నెల్లూరు రూరల్ మండల కమిటీ విజ్ఞప్తి చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు శ్రీపతి దయాకర్, బద్దిపూడి వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# రిజిస్ట్రేషన్ శాఖలో కార్డు ప్రైమ్ 2.0 విధానం సవరణలు చేయాలి

## ముత్తుకూరు డాక్యుమెంట్ రైటర్లు సంఘం డిమాండ్



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ పరిధిలో ఉన్నటువంటి కార్డు ప్రైమ్ 2.0 విధానంలో సవరణలు చేపట్టాలని ముత్తుకూరు మండల కేంద్రం డాక్యుమెంట్ రైటర్లు సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఆ సంఘం ఉన్నత స్థాయి ఆదేశాలు మేరకు ముత్తుకూరు సబ్ రిజిస్టర్ కార్యాలయం పరిధిలోని డాక్యుమెంట్ రైటర్లు అసోసియేషన్ కార్యవర్గం ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించింది. డాక్యుమెంట్ రైటర్లు ఏకాభిప్రాయంతో ఈ కార్యక్రమాన్ని చేశారు. ఈ నేపథ్యంలో పెన్ డౌన్ కార్యక్రమాన్ని డాక్యుమెంట్ రైటర్లు నిర్వహించగా రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు నిలిచిపోయినాయి. దీంతో కార్యాలయం వెలవల పోయింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆ సంఘం నాయకులు తొండమనాటి శ్రీధర్ మాట్లాడారు. 13 అంశాల పైన రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ నిరసన కార్యక్రమాన్ని చేసామన్నారు. ఈ విధానంలో అనేక ఇబ్బందులు ఉన్నాయని ఈ విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలని కోరారు. రిజిస్ట్రేషన్ కార్యకలాపాలకు వచ్చేటువంటి వారికి సులభతరంగా పని జరిగే విధంగా ఉండాలే తప్ప పబ్లిక్ డేటా ఎంట్రీ చేసేటప్పుడు ఓటిపిలు చెప్పాల్సిన సందర్భంలో పేదలు ఎంతో ఇబ్బందులు పడుతున్నారని డాక్యుమెంట్ రైటర్లు సంఘం నాయకులు అన్నారు. ప్రభుత్వం ఆలోచించి సవరణలు చేపట్టాలని ఆయన కోరారు. ప్రభుత్వానికి సహకారం ఇస్తాము తప్ప వ్యతిరేకించే పరిస్థితి ఉండదని డాక్యుమెంట్ రైటర్లు సంఘం నాయకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్లు శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, వాసు, శివయ్య, సుబ్రహ్మణ్యం, ఏడుకొండలు, పవన్, హనుమాన్, సహాయక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పంటలసాగు, ఎరువుల వినియోగంపై రైతులు అవగాహన కలిగిఉండాలి





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రైతులు పంటసాగు, యాజమాన్య విధానాల పట్ల, ఎరువుల వినియోగంపట్ల, ప్రకృతివ్యవసాయం గురించి అవగాహన కలిగి ఉండాలని ఆత్మకూరు మండల వ్యవసాయాధికారి కె.కిషోర్‌బాబు పేర్కొన్నారు. సోమవారం ఆత్మకూరు మండలం వాసిలి గ్రామంలో అవగాహనా కార్యక్రమాన్ని కిషోర్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. రైతులకు అవగాహన కల్పించేలా బ్యానర్లు, ప్లకార్డులుతో గ్రామంలో అధికారులు, సిబ్బంది, రైతులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలో అవగాహనా సదస్సును నిర్వహించారు. అధికమోతాదులో యూరియా వినియోగం వలన కలిగెడి ఇబ్బందులు, ప్రకృతివ్యవసాయం వలన కలిగెడి ప్రయోజనాలు, సిసిఆర్‌సి కార్డులు గురించి కిషోర్‌బాబు వివరించి రైతులకు అవగాహన కల్పించారు. పంటలసాగులో విచక్షణారహితంగా ఎరువులను వినియోగించరాదని, ప్రధానంగా యూరియాను అధికంగా వాడడంవలన అనేక అనర్ధాలుంటాయని ఆయన వివరించారు. నేల, నీరు, గాలికాలుష్యం నుండి పంటలను కాపాడుకునే విధానాలను గురించి కూడా కిషోర్‌బాబు అవగాహన కల్పించారు. రైతులు తప్పకుండా భూసార పరిక్షలకనుగుణంగా యూరియా వాడుకోవాలని, దాంతో ఖర్చులు తగ్గుతాయని, దిగుబడులు పెరుగుతాయని వ్యవసాయాధికారి వివరించారు. ప్రకృతివ్యవసాయం అత్యంత ప్రయోజనకరమని, తద్వారా ఆరోగ్యకరమైన ఉత్పత్తులు లబిస్తాయని, వ్యయం గణనీయంగా తగ్గుతుందని, దిగుబడులు లాభదాయకంగా ఉంటాయని కిషోర్‌బాబు వివరించారు. మండల తెలుగుదేశం అధ్యక్షుడు సుంకర పెంచలచౌదరి పంటలసాగులో నిర్ణీత నియమావళిని అనుసరించాలని, శాస్త్రవేత్తలు, అధికారులు ఇచ్చే సూచనలను తుచ తప్పకుండా పాటించాలని కోరారు. రైతులు తగు మెళుకువలు, జాగ్రత్తలు పాటించాలని, యూరియా అధికంగా వాడరాదని, అధికారులు సూచించిన ప్రకారంమే వినియోగించాలని చౌదరి సూచించారు. ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకత, పిఎండిఎస్ కిట్‌ల గురించి ఏపిసిఎన్‌ఎఫ్(ప్రకృతివ్యవసాయం) మాస్టర్‌ట్రైనర్ వెంకటలక్ష్మి రైతులకు వివరించారు. ఈ సందర్భంగా రైతులకు పిఎండిఎస్ కిట్‌లను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విఏఏనితీష్, గ్రామ నాయకుడు గంగా పద్మయ్యనాయుడు, ఏపిసిఎన్‌ఎఫ్ సిబ్బంది, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## భూసార పరీక్షలపై రైతులకు అవగాహన



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం మల్లూరు గ్రామ సచివాలయం నందు రైతాంగానికి భూసార పరీక్షలు, అధిక మోతాదులో యూరియా వినియోగించడం పట్ల జరిగే అనర్ధాలపైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు. స్థానిక గ్రామ కమిటీ అధ్యక్షులు నీళ్ల రాంబాబు, నీళ్ళరామకృష్ణ ఏర్పాట్లను పర్యవేక్షణ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వనరుల కేంద్రం ఏడిఏ మారుతి దేవి మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞానంలో అధిక ఎరువులు వాడకం వల్ల పంట దిగుబడి తగ్గిపోతుందన్నారు. నేల స్వభావాన్ని కోల్పోకుండా చూడాలని ఆమె రైతులకు సూచించారు. ఇదిలా ఉండగా రైతులు గిట్టుబాటు ధర పైన వ్యవసాయ శాఖ అధికారులను ప్రశ్నించారు. ప్రభుత్వం చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భూసార పరీక్ష కేంద్రం ఏవో నిర్మల, స్థానిక అగ్రికల్చర్ ఆఫీసర్ జోత్స్న రాణి, సహాయకులు జగదీష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల బారినుండి ప్రజలను కాపాడాలి : సీపీఐ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మున్సిపాలిటీలో ప్రజలను సీజనల్‌వ్యాధుల బారినపడకుండా కాపాడాలని సిపిఐ నాయకులు కోరారు. వారు సోమవారం స్తానిక మున్సిపల్ కార్యాలయంలో ఆర్ఐ షేక్ షాజహాన్‌కు ఒక వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా పట్టణ సిపిఐ కార్యదర్శి జంగం నాగరాజు మాట్లాడుతూ.. సీజనల్‌వ్యాధులు విష జ్వరాలు సోకి అనేకమంది బాధపడుతున్నారన్నారు. వ్యాధులు సోక కుండేలా అన్ని వార్డుల్లో బ్లీచింగ్ చల్లించాలని, దోమలలార్వాలు ఉత్పత్తి కాకుండేలా గుళికలను కాలువల్లో వేయాలని, దోమలనివారణ మందును పిచికారి చేయించాలని ఆయన కోరారు. వర్షాలు ఆరంభమైనందున సీజనల్ వ్యాధులు అధికంగా ప్రబలుతున్నాయని, సత్వరమే నివారణ చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బెల్లంకొండ హజరత్తయ్య, ఎన్.కొండయ్య, అంకమ్మ, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులకు మునిసిపల్ నీటిని సరఫరా చేయాలి



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణం బుడమగుంట గిరిజన సంఘం ప్రజలకు మున్సిపల్ నీటిని సరఫరా చేయాలని సోమవారం మునిసిపల్ కమిషనర్ జి.శ్రావణ కుమార్‌కు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజలు వినతిపత్రం అందజేశారు. అనంతరం సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ.. 17వ వార్డు బుడమగుంట గిరిజన సంఘంలో సుమారు 100 కుటుంబాల గిరిజనులు నివాసముంటున్నారని, వీరందరూ నిరుపేదలని కూలి పనులు చేసుకొని ఏ రోజుకారోజు గడుపుకునే వారన్నారు. పది సంవ త్సరాలు పైబడినప్పటికీ ఈ కాలనికి మున్సిపల్ వాటర్ సరఫరా లేదన్నారు. దీని వలన అక్కడ ప్రజలు త్రాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. టాంకర్ ద్వారా పోసే నీళ్లు త్రాగేం దుకు పనికిరావని, పది సంవత్సరాల నుండి త్రాగు నీటికి ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు వెంటనే తగు చర్యలు చేపట్టి, అక్కడ నివాసం ఉంటున్న వారికి మున్సిపల్ నీటిని సరఫరా చేయ్యాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు జి.మధుసూదన్ రావు, పి.తిరుపాలు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఒకే యాప్‌లో వెయ్యికి పైగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సేవలు

## యుఎంఏఎన్‌జి యాప్‌పై ప్రజల్లో అవగాహన అవసరం : జాయింట్ కలెక్టర్ హామీ

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సేవలు, పథకాలు 1000 కి పైగా ఒకే యాప్ ఉమాంగ్ (యుఎంఏఎన్‌జి)లో లభించడం, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ ప్రజలకు డిజిటల్ పాలనను చేరువ చేయడానికి తీసుకొచ్చిన ఉమంగ్ యాప్ చాలా ఉపయోగకర మైనదని, బిజెపి మాజీ జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్ పేర్కొన్నారు. ప్రవీణ్ మీడియాతో మాట్లాడుతూ.. '550' పైగా ఉన్న కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకి తెలియక అవగాహన లేక వీటిని ఉపయోగించలేక పోతున్నారు. ఈ యాప్ ద్వారా గ్రామీణ ప్రజలు ప్రభుత్వ కార్యాలయానికి రాకుండా ఇంటి వద్దనే కేంద్ర ప్రభుత్వ పథకాలు అప్లై చేసుకుని వినియోగించవచ్చు అన్నారు. ఆధార్, డిజిలాకర్, పాస్‌పోర్ట్, స్కాలర్‌షిప్, ఈపీఎఫ్‌ఓ, ఆరోగ్య సేవలు వంటి అనేక సేవలు ఒకే యాప్ ద్వారా అందుబాటులోకి రావడం ప్రజల జీవనాన్ని మరింత సులభతరం చేస్తోందని వివరించారు. తెలుగు సహా 13 భాషల్లో యాప్ అందుబాటులో ఉండటం గ్రామీణ ప్రజలకు కూడా మేలు చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే (యుఎంఏఎన్‌జీ) యునిఫైడ్ మొబైల్ అప్లికేషన్ ఫర్ న్యూ ఏజ్ గవర్నెన్స్ యాప్ వచ్చిచాలా కాలం అయినప్పటికీ యువత, రైతులు, ప్రజలు, మహిళలలో ఈ యాప్ గురించి సరైన అవగాహన లేదన్నారు. ఈ విషయమై జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తికకి అర్జీ సమర్పించగా, ఆయన సానుకూలంగా



స్పందించి జిల్లా వ్యాప్తంగా త్వరలో అవగాహన కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. ప్రతి పౌరుడు యుఎంఏఎన్‌జీ యాప్ డౌన్‌లోడ్ చేసి వినియోగించుకోవాలని, ఇది డిజిటల్ ఇండియా లక్ష్యానికి పెద్ద అడుగని, ప్రజల జీవితాలను మరింత సులభతరం చేసే ఈ యాప్‌ను అందరూ వినియోగించుకోవాలని ప్రవీణ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రామలింగాపురం మండల ప్రధాన కార్యదర్శి కిరణ్, బీజేపీ సీనియర్ నాయకులు బెల్లంకొండ రామకృష్ణ, తిరువీధి నారాయణ, సాయి, ప్రదీప్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# పీహెచ్‌పీ వైద్య సేవలు ఎంతో అభినందనీయం



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** సమాజానికి ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వైద్య సేవలు భాగంగా సోమవారం నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని బుజబుజనెల్లూరు లోని ఎస్టీ కాలనీ, న్యూ కాలనీ, గిరిజన కాలనీలోని ఎంపీపీ స్కూల్స్, బిజెపి కాలనీలోని ఎంపీపీ ఉర్దూ స్కూల్ నందు కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పిఎంపి అసోసియేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న 25వ డివిజన్ కార్పొరేటర్ బద్దెపూడి నరసింహగిరి మాట్లాడుతూ.. పీ.హెచ్.పీలు ప్రాథమిక వైద్య సేవలకే పరిమితం కాకుండా, సమాజ సేవా

## 25వ డివిజన్ కార్పొరేటర్ బద్దెపూడి నరసింహ గిరి

కార్యక్రమాల్లో చాలా ముందు ఉంటున్నారని, సమాజానికి వీరి సేవలు ఎంతో అవసరం అని అన్నారు, వరల్డ్ ఫస్ట్ ఎయిడ్ డేని పురస్కరించుకొని బుజబుజ నెల్లూరులోని నాలుగు మండల ప్రజా పరిషత్ పాఠశాలలందు ఉచితంగా ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లను అందజేయడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి జన్ని రమణయ్య మాట్లాడుతూ.. పిల్లలు ఆటల సమయంలో అనుకోనివిధంగా కిందపడిన పుడు శరీరానికి గాయాలు అయ్యి, రక్తస్రావం అవుతున్నప్పుడు వీరు అందించిన ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, సమయానికి ప్రథమ చికిత్స అందించి, దగ్గరలోని హాస్పిటల్‌కి తరలించినట్లయితే రక్తస్రావాన్ని అరికట్టి, వైద్య సేవలు పొందినట్లయితే పిల్లలకు స్వస్థత చేకూరుతుందని, పిల్లల ఆరోగ్యం పట్ల పీహెచ్‌పీలు కనపరుస్తున్న సేవలు స్లాఘనీయమని అన్నారు. నాలుగు పాఠశాలల పిల్లలకు చాక్లెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పీహెచ్‌పీ నాయకులు శాఖవరపు వేణుగోపాల్, దేవరకొండ శ్రీనివాసులు, టిడిపి నాయకులు దూడలు వెంకట నరసయ్య, దొడ్డక రమేష్, పాఠశాలల హెచ్ఎంలు జి.కామాక్షి, జీవీ.రమణారెడ్డి, కె.నరసింహులు, ఎస్కే జీ.ఖాదరున్నిసా, షేక్.సమీఉన్నిసా, మహేష్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ కట్టడాలపై స్పందించిన మున్సిపల్ కమిషనర్







**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో రోజురోజుకీ అక్రమ కట్టడాలు ప్రభుత్వ భూముల్లో కట్టడాలు పెరిగిపోతున్నాయి. ఈ విషయాన్ని పట్టించుకునే నాధుడే లేక కరువయ్యారు. దీనిపై 'సూర్య' దినపత్రికలో గత రెండు రోజుల నుంచి ఈ అక్రమ కట్టడాలపై ప్రచురిస్తూ ఉంది బహుళ అంతస్తులు అంతస్తులు నిర్మించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ భవన యజమానులు ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారని ప్రచురించడంపై కావలి మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్ స్పందించి సోమవారం ఈ బహుళ అంతస్తుల నిర్మాణాన్ని ఆపివేయాలని నోటీసులు అంటించడం జరిగింది. కావలి పట్టణంలో అనుమతులు లేకుండా ఈ బహుళ అంతస్తులు నిర్మాణాన్ని ఆపేందుకు యజమానులకు ఇది ఒక మార్గదర్శకమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఎక్కడైనా సరే బహుళ అంతస్తులు నిర్మించే ముందు మున్సిపల్ పర్మిషన్ తప్పనిసరిగా తీసుకోవాలని లేకపోతే ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్‌కుమార్ హెచ్చరించారు. ప్రభుత్వ అనుమతులు తీసుకొని ప్రభుత్వ ఆదాయానికి కావలి పట్టణ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు.

## క్రీడా మైదానంలో ముళ్ళ చెట్లను తొలగింపు



**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం దట్టమైన ముళ్లపదులతో ఏపుగా పెరిగి విద్యార్థులు ఆడుకొనుటకు క్రీడ మైదానం ఇబ్బందికరంగా ఉందని పాఠశాల క్రీడ ఉపాధ్యాయుడు నరసింహమూర్తి కోవూరుపల్లి పంచాయతీకి చెందిన రామ్మోహన్ రెడ్డికి క్రీడా మైదాన పరిస్థితిని వివరించగా వేణు వెంటనే స్పందించిన రామ్మోహన్ రెడ్డి జెసిబి సహాయంతో క్రీడా మైదానంలో ఉన్న ముళ్ల చెట్లను తొలగించి విద్యార్థులు ఆడుకొనుటకు మైదానాన్ని శుభ్రం చేసినారు. ఈ సందర్భంగా దాత రామ్మోహన్ రెడ్డికి పాఠశాల అధ్యాపకులు కృతజ్ఞతలు తెలియజేసారు.

## ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీర్స్ డే



**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలం కడనూతల రామిరెడ్డి సుబ్బరామి రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినాన్ని పురస్కరించుకొని ఇంజనీర్స్ దేను ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పివిఎన్ రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ కే.రాజారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏపీఎస్‌సిబిలో చీఫ్ ఇంజనీర్‌గా పనిచేసి రిటైర్డ్ అయిన ఎన్‌వివి సుబ్బరాజుని ఘనంగా సన్మానించినట్లు తెలిపారు. ముందుగా శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలవేసి తదుపరి కార్యక్రమం మొదలుపెట్టారు. ఈ కార్యక్రమంలో సన్మాన గ్రహీత, కళాశాల డైరెక్టర్ డాక్టర్ కే.రాజారెడ్డి మాట్లాడుతూ.. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జాతికి చేసిన సేవలు, వారు కట్టించిన డ్యాములు గురించి బిటెక్ విద్యార్థిని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏవో ఆర్వి రమణారెడ్డి అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఏ.కిరణ్ కుమార్ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## శరత్చంద్ర చటోపాధ్యాయ జయంతి వేడుకలు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులోనే శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి జ్యోతి కొండయ్య ఆధ్వర్యంలో శరత్ చంద్రచటోపాధ్యాయ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా చటోపాధ్యాయ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ.. గ్రంథాలయ అభివృద్ధికి శరత్చంద్ర చేసిన సేవలు అమోఘమని కొనియాడారు.

## సొసైటీ చైర్మన్‌కు సన్మానం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు సొసైటీ చైర్మన్గా నూతనంగా ఎంపికైన చల్ల వెంకటేశ్వర్లు యాదవ్‌ను వింజమూరు కారు డ్రైవర్స్ అసోసియేషన్ తరపున ఘనంగా సన్మానించారు. సోమవారం స్థానిక సొసైటీ కార్యాలయంలో చైర్మన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్చాన్ని అందజేసి శాలువా పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గోను బాలకృష్ణ పెంచలయ్య వెలుగోటికిషోర్ వెంకటరమణ వెలుగోటి వెంకట్రావు మెట్టుపల్లి మురళి గజ్జల పెంచలయ్య రమేష్ ఎస్కే బాదుల్లా తదితరులు ఉన్నారు.

# రైతులకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** గతంలో లాగా రైతులకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్‌పీఐ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్.కె మాబు సోమవారం నెల్లూరులోని కలెక్టరేట్లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తీక్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రైతులకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, రైతుల పండించిన పంటకు మద్దతు ధర కల్పించాలని, వర్షాల వల్ల నష్టపోయిన రైతులను గుర్తించి నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని అదేవిధంగా రైతులకు ఈసారి ఖరీఫ్ పంటలో ఎటువంటి అన్యాయం జరగకుండా చూడాలని జిల్లా కలెక్టర్‌నీ కోరడం జరిగిందని మాబు తెలియజేశారు. రైతులు ఈ ప్రపంచానికి వెన్నుముక లాంటి వారిని అలాంటి రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధర కల్పించాలని అంతేకాకుండా ఈసారి ప్రస్తుతం పండించిన పంటకు గత సంవత్సరం తర హాలో రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులకు గత ఏడాది లాగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వారికి మద్దతు ధర కల్పిం చి ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసి వారికి బ్యాంకు ఖాతాలో నగదు జమ అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో రైతులకు మాయ మాటలు చెప్పి రైతుల కష్టాలను దోచేస్తున్న దళారీ వ్యవస్థను తరిమికొట్టి వారిపై చట్టపరంగా శాఖా పరమైన చర్యలు తీసుకొని ఉగ్గుపాదంతో అణచి వేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టపు రంగారావు, ఉపాధ్యక్షులు బత్తల మధుసూదన్, దుంపల సుబ్బారావు, నంబూరు గణేష్, ఉప్పునూరు మాలకొండయ్య, తూపిరి వంశీకృష్ణ, బెల్లంకొండ ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

# ముసునూరు వినాయక కాలనీకి కరెంటు లైన్ వెయ్యండి : సీపీఎం



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణం ముసునూరు వినాయక కాలనీకి కరెంటు లైన్ వేయాలని అక్కడ ప్రజలు సోమవారం సిపిఎం పార్టీ ఆధ్వ ర్యంలో ఎలక్ట్రికల్ ఈఈ కే.ఎస్. బెనర్జీకి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. అనంతరం అక్కడ ప్రజలు మాట్లాడుతూ.. వినాయక కాలనీ ఏర్పడి, పదిసంవత్సరాలు పైబడిందన్నారు. ఇప్పటివరకుకరెంటు లైన్ వేయలేదన్నారు. సుమారు అర కిలోమీటర్ దూరం నుండి కర్రలపై వైర్లు లాక్కొని, కరెంటు వెలిగించుకుంటున్నామన్నారు. కొంత మందికి మీట ర్లు ఉన్నాయని కరెంటు బిల్లులు కూడా ప్రతి నెల చెల్లిస్తున్నామని, కరెంటు స్థంబాలు వేయించి వైర్లు వేయాలని ఎన్నోసార్లు కరెంటు ఆఫీస్ చుట్టూ తిరి గామన్నారు. కాలయాపన చేస్తున్నారని, వర్షం పడిన ప్పుడు, గాలి తోలిన ప్పుడు కర్రలు విరిగిపోయివైర్లుకింద పడుతున్నాయనిదీనివలన అక్కడ తిరిగే ప్రజలు భయ భ్రాంతులకు గురవుతున్నారన్నారు. కర్రలు విరిగిపోయిన ప్పుడు కరెంటు ఉండదని, కరెంటు లైనందునచాలా ఇబ్బందులుగురి అవుతున్నామని సోమవారం వినతి పత్రాన్ని అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య, నాయ కులు జి.మధుసూదన్‌రావు, పి.తిరుపాలు పాల్గొని మాట్లాడుతూ.. కరెంటు లైన్లేనందున అక్కడ ప్రజలు చాలాఇబ్బం దులు పడుతున్నారన్నారు. కర్రలపై వైర్లు లాగితే కర్రలు పడిపోయినప్పుడు ప్రమాదం జరిగే పరిస్థితి ఉంటుందన్నారు. ఈ సమస్యని గమ నించి ఎలక్ట్రికల్ అధికా రులు కరెంటు లైన్లాగాలని డిమాండ్ చేశారు. అలా జరగని ఎడల స్థానిక ప్రజలతో కలిసి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానికులు ఎస్కే. షాపిర, ఎస్.కె అస్మత, జి.శ్రీకాంత్ మరి కొంతమంది పాల్గొన్నారు.

# అన్నదాత కార్డున్న ప్రతి రైతుకు రూ.5లక్షల బీమా



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ఈ అన్నదాత కార్డు పొందిన ప్రతి రైతుకు 5 లక్షల రూపాయలు బీమా వర్తిస్తుందని భీమా వర్తిస్తుందని న్యూ అప్పి రెంట్స్ సాఫ్ట్వేర్ కంపెనీ గుణిశేఖర్ తెలిపినట్లు ఆ సంస్థ సభ్యుడు సాయికుమార్ తెలిపారు. సోమవారం నెల్లూరు జిల్లా జర్నలిస్ట్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ అన్నదాత కార్డు పొందిన రైతుకు ప్రమాద బీమా కింద రూ.25లక్షలు వర్తిస్తుందన్నారు. రైతు కిసాన్ కార్డుతో 500 రూపాయలు నుండి అంతకంటే ఎక్కువ కొనుగోలు చేస్తే 40శాతం రాయితీ లభిస్తుందని చెప్పారు. అంతేకాకుండా రైతులకు కావాల్సిన మరెన్నో సదుపాయాలను ఈ అన్నదాత కార్డు ద్వారా సన్నా, చిన్న కారు రైతులందరూ రాష్ట్ర ఈ అన్నదాత పార్ట్నర్ ఆయుష్ ఇన్ఫో సర్వీసెస్ అధినేత మంచరి సోమశేఖర్ రావు సూచించినట్లు పేర్కొన్నారు. ఈ సేవల ను నెల్లూరు జిల్లా రైతులు అన్ని అందించడానికి గుణశేఖర్ శెట్టి స్థాపిం చిన న్యూ అప్పీ రెంట్స్ సాఫ్ట్వేర్ కంపెనీ సంస్థను ఎన్నుకోవడం జరిగింద న్నారు. దేశానికి రైతే వెన్నుముక అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వంలో ప్రధాని నరేంద్రమోడీ దేశానికి పక్షపాతిగా ఎన్నో పథకాలను ప్రారంభిం చడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా పిఎంసిసి కిసాన్ ఆన్మోల్ క్యాంటీన్ కార్డు పథకం రైతుల సహాయ కేంద్రంను రాష్ట్రం అంతటా నిర్వహించడానికి ఆయుష్ ఇన్ఫో సర్వీసెస్ సేవా శాఖ ద్వారా ఈ - అన్నదాత కార్డులను రైతులకు అందజేయడానికి ప్రభుత్వంతో భాగస్వామ్యం కావడం జరిగిందని చెప్పారు. ఈ సమావేశంలో గుణశేఖర్ శెట్టి, రాజేంద్ర, నారాయణమూర్తి, రామకృష్ణ రాజు తదితరులు పాల్గొన్నారు.



# రేపటి నుంచి స్కూల్ గేమ్స్ ఎంపికలు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం నుంచి శుక్రవారం వరకు 69వ ఏపీ స్కూలేమ్స్ ఫెడరేషన్-2025 మండలస్థాయి ఎంపికలు జరనున్నట్లు ఎంఈవో-1 టీ.వెంకటేశ్వర్లు, కో-ఆర్డినేటర్ ప్రసాద్లు సోమవారం ఓ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థిని, విద్యార్థులు అండర్-14, 17 విభాగాల్లో పాల్గొనేందుకు లీప్ యాప్ నందు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా, చెస్, అథ్లెటిక్స్ తదితర పోటీలు జరుగుతాయన్నారు. మరిన్ని వివరాలకు 6300746554 అనే నెంబరను సంప్రదించాలని వారు కోరారు.

# పంపింగ్ స్టేషన్ తనిఖీకి చేసిన కమిషనర్



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా సోమవారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలోని ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకు, పంప్ స్టేషన్, డాగ్ షెడ్ తదితర ప్రాంగణాలలో పర్యటించి వాటి నిర్వహణ తీరును పరిశీలించారు. ప్రాంగణంలోని నిరుపయోగంగా ఉన్న వాహనాలను పరిశీలించారు. ప్రాంగణంలోని వివిధ విభాగాలకు సంబంధించి అధికారులకు సూచనలు జారీ చేశారు. అనంతరం స్థానిక జయలలిత నగర్ ప్రాంతంలోని పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణ తీరును కమిషనర్ తనిఖీ చేసి ఇంజనీరింగ్ అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కార్యకర్తలను పరామర్శించిన మాజీ మంత్రి



**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** ఇటీవల మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి నివాసంపై జరిగిన గూండాల దాడి అనంతరం, జూలై 31న వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నల్లపరెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన విషయం తెలిసిందే. ఆ సందర్భంలో జరిగిన ఉద్రిక్తతలో పలువురు కార్యకర్తలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ నేపథ్యంలో నేడు ఇందుకూరుపేట మండలం పరిధిలోని మైపాడు, నాగరాజుతోపు గ్రామాల్లో గాయపడిన కార్యకర్తలను స్వయంగా పరామర్శించి, వారిని ధైర్యం చెప్పిన మాజీ మంత్రి, వైసీపీ రాష్ట్ర పీఏసీ సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి. ఈ సందర్భంగా కార్యకర్తలకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అన్నివిధాలుగా అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీఎల్‌డీఏ ఛైర్మన్ గొల్లపల్లి విజయ్ కుమార్, వైసీపీ రైతు విభాగం అధికార ప్రతినిధి బట్టేపాటి నరేంద్ర రెడ్డి, మైపాడు సర్పంచ్ సంఘం వెంకయ్య, కోవూరు నియోజకవర్గ వైయస్సాఆర్ టీయూ అధ్యక్షులు బిరదవోలు రూప్ కుమార్‌రెడ్డితో పాటు స్థానిక వైసీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెన్నా బ్యారేజి నుండి దిగువకు నీరు విడుదల



**సంఘం, మేజర్‌న్యూస్ :** నీటి విడుదల కార్యక్రమంలో పాల్గొన్న బ్యారేజి డీఈ జయరామిరెడ్డి, ఏఈలు, ఇరిగేషన్ ఏఈ వినయ్ కుమార్, టీడీపీ మండల అధ్యక్షులు బాణా శ్రీనివాసులురెడ్డి, సంగం సొసైటీ అధ్యక్షులు గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్, అన్నారెడ్డీపాలెం నీటి సంఘం అధ్యక్షులు సూరా శ్రీనివాసులు రెడ్డి, ఎస్ఐ రాజేష్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ సల్మా, బ్యారేజి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి నీటిని విడుదల చేసిన ఇరిగేషన్ అధికారులు, టీడీపీ నాయకులు సోమశిల నుండి పెన్నా బ్యారేజి కు భారీగా నీటిని విడుదల చేయడంతో బ్యారేజికి చేరుతున్న సోమశిల నీరు. బ్యారేజి నుండి గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసిన అధికారులు. పెన్నా పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించిన అధికారులు మత్స్యకారులు, ప్రజలు, పశువుల కాపరులు పెన్నానదిలోకి దిగరాదని అధికారులు సూచించారు.

# శాశ్వత భవనంగా ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహాన్ని నిర్మించాలి

**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో బీసీ ప్రభుత్వ బాలుర వసతి గృహము ఇప్పటివరకు అద్దె భవనాల్లో ఉంటూ ప్రభుత్వానికి భారంగా ఉంది అలాగే విద్యార్థులు కూడా ఆ వసతి గృహాన్ని మారుస్తూ ప్రదేశాన్ని ఉంటుండడం వల్ల వసతిగృహాలో ఉండే విద్యార్థులు కూడా ఇబ్బందికరంగా తయారైంది అని బీసీ ఐక్య వేదిక నాయకులు సోమవారం కావలి ఆర్డిఓ సన్నీ వంశీకృష్ణకు వినతి పత్రాన్ని అందించారు .గౌరవ అధ్యక్షులు పురిటి గోవిందు ప్రధాన కార్యదర్శిని వరప్రసాద్ రాష్ట్ర నాయకులు ప్రభాకర్ రావు మాట్లాడుతూ.. 2013వ సంవత్సరంలో విద్యార్థులకు ఈ కళాశాల ప్రారంభం అయినది అప్పటినుండి కావలి పట్టణంలోని స్థానిక కోపరేటివ్ కాలనీలో ఒక అద్దెకు భవనాన్ని తీసుకొని సుమారు వందమంది విద్యార్థులు ఈ వసతి గృహంలో ఉండడం జరిగింది. అయితే ఈ వసతి గృహం వసతులు సరిగా లేనందువలన, సమస్యలు ఉన్నందువల్ల ఇక్కడి నుండి పట్టణంలోని జనతా పేటలోకి మార్చబడింది. ఈ మార్పులు చేర్పులవలన విద్యార్థులు కొంత అసహనానికి ఇబ్బంది గురవుతున్నారని, కాబట్టి ఉన్నత అధికారులు స్పందించి వెనకబడిన తరగతుల కళాశాల బాలుర వసతి



గృహమునకు శాశ్వత భవనం మంజూరు చేస్తే విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కావలి పట్టణం తుమ్మలపెంట్ రోడ్ లో ఉన్న జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల నందు ప్రభుత్వ స్థలం ఉన్నదని అందులో ఒక శాశ్వత భవనాన్ని నిర్మించాలని కోరారు.

# అవగాహన లేకపోతె ఆరోగ్యం అధోగతి : హెూమియోవైద్యుడు డాక్టర్ వి.కరుణాకర్

**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** ఈ రోజుల్లో వయో తారతమ్యం లేకుండా అందరు సోషల్ మీడియా ఫాలోవర్స్‌గా మారిపోయిన వయసంలో అందరు సోషల్ మీడియాలో వచ్చె ప్రకటనలను చూసి వాటిని అనుకరిస్తున్నారు. ముఖ్యంగా ఆరోగ్యవిషయంలో డైన్నైన ముందుగా నెట్‌లో వెదకడం. దాని కారణాలు ఏమిటి, పరిష్కారాలు ఏమిటి, ఏమి మందులు వాడాలి, ఏఏ ఆహార పదార్ధాలు తినాలి అని శోధించి సొంతనిర్ణయాలతో అవె అనుకరిస్తున్నారు. ఇలాంటి విధానాల వల్లన మేలు కంటె చెడు ఏక్కువ జరిగే ప్రమాదముందని హెచ్చరిస్తు వీటిపట్ల అవగాహన



లేకపొతె, విధానాలను నియంత్రించుకోకుంటె ఉన్న ఆరోగ్యము కాస్త అధోగతి, జీవితం అంధకారమౌతుందని సూచిస్తున్నారు హెూమియోవైద్యులు డా కరుణాకర్. దైనందిన జీవితములో ఏన్నో విషయాలపట్ల అవగాహన కలిగి ఉండాలి లేదంటె ఇబ్బంది పడాల్సిన అవసరము ఉంటుంది. యెటుబ్ వీడియోలు చుస్తు వాటిల్లో చెప్పిన విషయోలు మనని అవసరమో లెదో కుడా ఆలోచించకుండా గుడ్డిగా అనుసరించడం వల్లన నష్టం జరిగే అవకాశం ఉంది అంటున్నారు. ఈ మధ్య హస్పిటల్‌కి వచ్చిన రోగులు వాళ్లు అనుసరిస్తున్న విధానాలు, వాడుతున్న మందులు ,అడుగుతున్న డౌట్స్ అన్నింటిని చూసాక అర్ధమైన విషయము అందరు యూటుబ్‌ని బాగ అనుసరిస్తు లేనిపోని అనుమానాలు, సందేహాలు కలిగించుకుని భయంతో, ఆందోళనలో ఉంటున్నారనె విషయం అర్ధమైంది. విటమిన్స్ వాడడం, మందులు మానెసి ఏక్సర్ సైజ్‌లు చెయ్యడం, రోగనిర్ధారణ పరిక్షలను నెట్‌లో చూసి చెపించుకోవడం, తేడా రావడంతో కృంగుబాటుకి లోనవ్వడం, అనవసరమైన మందులను వాడడం, కోన్ని అహారపధార్ధాలను రోజు మోతాదికి మించి తినడము ,లెదా అసలు తీసుకోకపోవడం, గంటలపాటు వ్యాయమాలు ఇలా చెప్పుకుంటు పొతే ఏన్నో విషయాలు ఉన్నాయి. యూటుబ్, నెట్‌లోని సమాచారం మంచిదె చూడోద్దు, అనుసరించోద్దు అనట్లెదు కాని సమగ్ర విశ్లేషణ, అవగాహనతో మనకి అవసరమో, లెదో, అవసరమైతె ఏంతమేరకు, ఏంతకాలము పాటు అనుసరించాలి నిపుణులు ఏ సందర్భంలో సుచించారు. అనుసరించెటప్పుడు ఏఏ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు అనె విషయాల్ని తెలుసుకుని అనుసరించాలని డాక్టర్‌గా సూచిస్తున్నా అన్నారు లేకపోతె ఆరోగ్యము దెబ్బతినడం కోత్త ఆరోగ్య సమస్యలు రావడమె కాదు ప్రాణహాని జరిగె ప్రమాదముందని తెలిపారు. కాబట్టి అన్ని తెలుసుకుని అనుసరించాలని పిలుపునిస్తున్నారు డా కరుణాకర్.

# భక్తి శ్రద్ధలతో ఝేలాల ఉత్సవం

**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన ఏఎస్ పేటలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ హజరత్ సయ్యద్ ఖాజా రహమతుల్లా నాయబ్ రసూల్ వారి 252వ గంధ మహెూత్సవంలో భాగంగా ఝేలాల ఉత్సవాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ముందుగా రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ ఆధ్వర్యంలో దర్గా వక్ఫ్ బోర్డ్ కార్యాలయం నుండి ఝేలాల ను దర్గా ఈవో షేక్ మొహమ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఫకీర్ల జరాబులతో భక్తి కీర్తనలతో తీసుకెళ్లి దర్గా గుమ్మటంపై ఉన్న హజ్రత్ అమ్మవార్ల చంద్రవంకు అమర్చారు. అలాగే మరో ఝేలాను దర్గా సజ్జదా నషిన్ ఎస్‌జిఎన్ హఫీజ్ పాషా ఆధ్వర్యంలో మహల్ నుండి ఫకీర్‌ల జరాబులతో భక్తి కీర్తనలు బాణా సంచా కాలుస్తూ దర్గాకు చేర్చి అనంతరం చంద్రవంకపై అలంకరించారు. ఈ సందర్భంగా చంద్రవంక శుద్ధిచేసిన తీర్థ ప్రసాదాలు భక్తులకు పంచి



పెట్టారు. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి భారీగా భక్తులు స్థానికులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎలాంటి సంఘటనలు జరగకుండా స్థానిక ఎస్ఐ ఏ సైదులు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

# దేశ భవిష్యత్తుకు జలాశయాలే పునాదులు

**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నదుల అనుసంధానం జరిగే లోపు జిల్లాలో సోమశిల హై లెవెల్.. వెలుగొండ ప్రాజెక్టు పనులు పూర్తిచేయాలని బిజెపి నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ డిమాండ్ చేశారు. విశ్వేశ్వరయ్య జయంతి వేడుకలను ప్రభుత్వ ఇంజనీర్లందరూ జరుపుకుంటున్నారు. ప్రముఖ ఇంజనీర్ స్వర్గీయ విశ్వేశ్వరయ్య జలాశయాలు దేశ భవిష్యత్తును అందరూ ఒకసారి గుర్తుకు తెచ్చుకోవాల్సిన అవసరం ఉంది. నదుల నీటి వాటాల కోసం రెండు తెలుగు రాష్ట్రాల మధ్య విభేదాలు నెలకొంటు న్నాయి. ప్రతి ఎకరాకు నిరంధించాలి. నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రం అభివృద్ధి చెందేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నారు. నదుల అనుసంధానం దీర్ఘకాలిక ప్రాజెక్ట్ కనుక జిల్లాలో నీటి వనరుల సంపూర్ణ వినియోగంపై దృష్టి సారించాలి. నదుల అనుసంధానం పేరుతో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయడం మంచిది కాదు. నెల్లూరు జిల్లాలో మెట్ట ప్రాంతాల అభివృద్ధికి సోమశిల హై లెవెల్ కెనాల్ పనులు. వెలిగొండ ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలి. పెండింగ్ ప్రాజెక్టులుగా మిగిలిపోతున్న వెలుగొండ కాలువ పనులు సోమశిల జలాలు మెట్ట రైతులకు అందించడం కోసం హై లెవెల్ కెనాల్ కాలువ నిర్మాణాలు చెరువుల అనుసంధానం పూర్తిచేయాలని బిజెపి నేత రమేష్ డిమాండ్ చేశారు.

# రసాయన ఎరువుల వాడకం అధికమైతే అనర్థాలు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని రైతులు పంటల సాగులో అధిక మోతాదులో ఎరువులు వాడితే భూసారం క్షీణిస్తుందని మండల వ్యవసాయ అధికారి విజయభాస్కర్ పేర్కొన్నారు. ఆయన సోమవారం మండలంలోని నేలటూరు గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటలు సాగు చేసే రైతులు వ్యవసాయ సిబ్బంది సూచనలు పాటించాలన్నారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. సేంద్రియ ఎరువుల వాడకం అలవాటు చేసుకోవాలన్నారు. ప్రతి రైతు 15-20రకాల గింజలు కలిసిన ఈ కిట్ పొలాల్లో చల్లు కోవాలన్నారు. ఫలితంగా భూసారం పెరగడంతోపాటు, సూక్ష్మజీవులు, సేంద్రీయ కార్బనము పెరుగు తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జీవో ప్రకారమే బ్రాందీ షాపు ఏర్పాటు



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో రామ్మూర్తి పేట పుల్లారెడ్డి నగర్ మధ్యలో దుకాణం నిర్మిస్తున్నట్లు సోషల్ మీడియాలో వార్త చక్కరలు కొడుతుంది. ఈ విషయం తెలుసుకున్న కొంతమంది 13 వార్డుకు చెందిన టిడిపి అధ్యక్షులు ఆధ్వర్యంలో స్థానిక ప్రజలు కావలి ఆర్డిఓ సన్నీ వంశీకృష్ణకు సోమవారం వినతిపత్రాన్ని అందించారు. అనంతరం పోతుగంటి శ్రీకాంత్ మాట్లాడుతూ.. కాలేజీలు దేవాలయం మధ్యలో బ్రాందీ షాపులు నిర్వహించడం మంచి పద్ధతి కాదని, దేవాలయాలకు కొంత దూరంలోనే ఉండాలని ప్రభుత్వ జీవో ఉన్నప్పటికీ నిబంధనలకు వ్యతిరేకంగా ఈ మద్యం దుకాణాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. రెడ్డి నగర్ ప్రజలకు ఇక్కడ కాలేజీలు గుడులు దగ్గర్లో ఉన్నందువల్ల ఈ మధ్యన దుకాణాన్ని తొలగించాలని కోరారు.ఈ విషయంపై "సూర్య ప్రతినిధి" కావలి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావుని ఎవరైనా అడగ్గా ఇంకా మా దగ్గరికి ఆ లైసెన్సు వివరాలు రాలేదు వస్తే ప్రభుత్వం నిబంధనలకు వ్యతిరేకంగా ఉంటే వాటిని తప్పకుండా అనుమతులు ఇవ్వమని, ప్రభుత్వ జీవోకి సమకాలింగా ఉంటే ఏమి చేసేది లేదని వారు వివరణ తెలిపారు.

# తప్పిపోయిన విద్యార్థిని తల్లిదండ్రులకు అప్పగింత



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండల రెవెన్యూ అధికారి కార్యాలయం నందు రూరల్ తహసిల్దార్ కృష్ణప్రసాద్ ముందు హాజరు పరిచి తప్పిపోయిన బాలుడుని తల్లిదండ్రులకు అప్పగించుట జరిగింది. నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని కావేరీ నగర్ చెందిన ఎం.సాయి గూడూరులోని ఎస్‌ఆర్‌కే కాలేజీలో ఇంటర్ చదువుతూ.. అక్కడ నుండి ఫ్రెండ్ ద్వారా ఫ్రెండ్ బంధువులు ఇంటికి అని వెళ్లి అక్కడ నుండి శ్రీకాళహస్తిలోని హిజ్రా లతో కలిసి ఫ్రెండ్ షిప్ చేసి తిరిగి ఇంటికి వచ్చి ఇంటిని వచ్చాక కనపడకుండా పోవడంతో సాయి తండ్రి రాము జిల్లా బాలల సంరక్షణ అధికారి బి సురేష్ ని కలిసి సమస్య తెలియజేయగా డిసిపివో బి.సురేష్ పోలీస్ స్టేషన్ సిఐతో మాట్లాడి మిస్సింగ్ కేసు కట్టించి బాబు ఆచూకీ తెలిసి గూడూరు హిజ్రాల దగ్గర ఉండగా పోలీస్ గూడూరు, నెల్లూరు వారు కలిసి బాబు సాయి ను ఈ రోజు నెల్లూరుకు తీసుకు రావడం జరిగింది. అనంతరం బాబును నెల్లూరు రూరల్ మండల తహసిల్దార్ కృష్ణ ప్రసాద్ ముందు హాజరు పరిచి బాబు తల్లిదండ్రులకు అప్పగించుట జరిగింది. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, డిసిపియూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నాటు సారా బట్టిని ధ్వంసం చేసిన అధికారులు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి మండలంలోని దుర్గం పల్లి అడవి ప్రాంతంలో ఏర్పాటు చేసి ఉన్న నాటు సారా బట్టిని సోమవారం అధికారుల బృందం ధ్వంసం చేశారు.



సారా బట్టి నిర్వహణపై వివిధ పత్రికల్లో, సామాజిక మాధ్యమాల్లో వార్త కథనాలు రావడంతో పోలీసు, అటవీ శాఖ, ఎక్సైజ్ శాఖల అధికారులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. నాటు సారా తయారీకి నిల్వ ఉంచిన 200 లీటర్ల బెల్లం ఊటను పారపోశారు. అలాగే సారా తయారీకి గారికి ఉపయోగించే సామాగ్రిని ధ్వంసం చేశారు. అనంతరం సేవా తారీకు ఉపయోగించే చెక్క, డ్రమ్ములు, తదితర సామాగ్రిని ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకుని కార్యాలయానికి తరలించారు. బట్టి నిర్వహణలో ఎవరి హస్తముందో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు కే ఇంద్రసేనారెడ్డి, ఏ శ్రీను, ఎక్సైజ్ ఎస్ఐ దీప్తి కరంత్, అటవీ శాఖ సిబ్బంది వెంకటేశ్వర్లు, లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కల నెరవేర్చడమే మంత్రి నారాయణ లక్ష్యం

- నెల్లూరు 47వ డివిజన్ కార్పొరేటర్ పొట్లూరు రామకృష్ణ
- డివిజన్లోని సచివాలయంలో హౌసింగ్ లబ్ధిదారులతో అధికారుల ప్రత్యేక సమావేశం
- ఎన్డీఏ ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించిన కార్పొరేటర్ రామకృష్ణ
- హౌసింగ్ లబ్ధిదారులకు సూచనలు, అధికారులకు సలహాలు



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** పేదల ఇళ్ల నిర్మాణానికి ఎన్‌డిఏ ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలని నెల్లూరు 47వ డివిజన్ కార్పొరేటర్ రామకృష్ణ సూచించారు. నెల్లూరు సిటీ 47వ డివిజన్ సచివాలయంలో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆదేశాల మేరకు కొండ్లపూడి 9, 10 లేఔట్ లబ్ధిదారులతో హౌసింగ్ ఈఈ మోహన్ రావు, ఏఈ భాస్కర్, సెక్రటరీ ఆధ్వర్యంలో సోమవారం సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 47వ డివిజన్ కార్పొరేటర్ పోట్లూరి రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నెల్లూరులో మంత్రి పొంగూరు నారాయణ ఆదేశాల మేరకు ప్రజా సంక్షేమ పరిపాలన కొనసాగుతుందని తెలిపారు. గతంలో లబ్ధిదారులకు ఇంటి స్థలాలు మంజూరు చేయబడి, కేంద్ర ప్రభుత్వం ద్వారా రూ.1,80,000 సాయం అందించి, కానీ ఇళ్లు నిర్మాణం పూర్తి కాని లబ్ధిదారులకి ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బీసీ, ఎస్సీ లబ్ధిదారులకు రూ.50,000, ఎస్టి లబ్ధిదారులకు రూ.75,000 అదనంగా మంజూరు చేస్తున్నారని తెలిపారు. దీని ద్వారా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా సమాచారం కోసం కొండ్లపూడి లేఔట్‌లో హౌసింగ్ ఆఫీస్‌ను టిడ్కో బిల్డింగ్‌లో ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా సచివాలయ సిబ్బంది సైతం సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. అందరి సమిష్టి కృషితో ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా పొట్లూరు రామకృష్ణ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ ఈ. చెంగయ్య, యూనిట్ ఇన్చార్జ్ రెహమాన్, కోట్లపాటి రాజా, బిఎల్‌సి పిల్ల ప్రసాద్, జహూర్ అహ్మద్, ఆర్‌వి గిరి, ముని కుమార్, సెక్రటరీ సిహెచ్.గిరిధర్, దువ్వూరు నరేంద్ర, మైనారిటీ ప్రెసిడెంట్ ఫిరోజ్, మహిళా ప్రెసిడెంట్ చైతన్య, రవి సింగ్, కంచి చంద్ర, టి.చంద్ర, మహంకాళి సురేంద్ర, జకీర, సునీత తదితరులు పాల్గొన్నారు.


సూర్య



విలేకర్లు కావలెను

తెలుగు పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దినపత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

కావలసిన సెంటర్లు

నెల్లూరు జిల్లాలోని సంగం, కొడవలూరు, మనుబోలు, అల్లూరు, దగదర్తి, కొండాపురం, కలిగిరి, కలువాయి, విడవలూరు, ఇందుకూరుపేట, కోవూరు, నెల్లూరు పట్టణంలోని దర్గామిట్ట, స్టోన్ హౌస్‌పేట, బాలాజీ నగర్‌లలో విలేకర్లు కావలెను

మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

నేటి దినపత్రిక సూర్య కార్యాలయం
మిలటరీ కాలనీ, రోడ్ నెం.1, ఎల్ఐసి & సివిడి ఆఫీసు ఎదురుగా,
కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు

9000118811, 9000483583


# ఆత్మకూరుకు చెందిన మెడిసిన్ విద్యార్థిని స్టేట్‌ఫస్ట్




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** పులికడుపున పులే పుడుతుంది, విజ్ఞానవంతుల కడుపున ప్రజ్ఞావంతులే పుడతారు అనేందుకు నిలువెత్తు సాక్ష్యంగా ఆత్మకూరుకు చెందిన ఎంబిబిఎస్ విద్యార్థిని ఎం.డి జనరల్‌మెడిసిన్‌లో 2024సంవత్సరానికి సంబంధించి అత్యంత ప్రజ్ఞ చూపి రాష్ట్ర స్థాయిలో ప్రథమురాలుగా నిలిచి బంగారుపతకాన్ని కైవసం చేసుకుంది. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని వెంకట్రావుపల్లికి చెందిన డాక్టర్ విరాజిత 2024పరిక్షల్లో అత్యంత ప్రతిభ చూపింది. స్టేట్‌ఫస్ట్‌గా నిలిచింది. బంగారుపతకాన్ని అందుకుంది. కడపలోని రిమ్స్ వైద్యకళాశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జనరల్‌మెడిసిన్ వైద్యుల 53వ సదస్సులో ఎన్టీయార్ హెల్త్‌యూనివర్శిటి వైస్‌ఛాన్సిలర్ పి.చంద్రశేఖర్ చేతులమీదుగా ఆమె బంగారుపతకాన్ని స్వీకరించింది. ఆత్మకూరు మండలంలోని గొల్లపల్లిలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న పి.సి.వి.రాఘవరెడ్డి-స్థానిక జెడ్పిహైస్కూల్లో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న వై.వి.స్వరాజ్యలక్ష్మిల కుమార్తె అయిన డాక్టర్ విరాజిత టెన్త్‌క్లాస్ వరకు స్థానిక సెయింట్‌మేరీస్ ఇంగ్లీష్‌మీడియం హైస్కూల్లో అభ్యశించి ఇంటర్మీడియట్ విజయవాడలోని శ్రీచైతన్య కళాశాలలో చదవి అప్పట్లో కూడా రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించి ప్రతిభ చూపారు. ఎంబిబిఎస్ కోర్సును భువనేశ్వర్‌లోని ఆల్‌ఇండియా ఇన్సిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో అభ్యశించింది. ఆంధ్రప్రదేశ్ జనరల్‌మెడిసిన్ ఫిజిషియన్ వైద్యులు రాష్ట్ర ప్రతినిధులు డాక్టర్ మనోజ్‌కుమార్, డాక్టర్ అల్లాడి మోహన్, రిమ్స్‌కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ మునీశ్వరరెడ్డి, జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ యాదవేంద్రరెడ్డి, పలువురు బంధుమిత్రలు డాక్టర్ విరాజితను అభినందించారు. ఆమెకు రాష్ట్రస్థాయి ప్రథమస్థానం, బంగారుపతకం రావడం పట్ల ఆత్మకూరుకు చెందిన పలువురు ఉపాధ్యాయినీ,ఉపాధ్యాయులు, వివిద ప్రజాసంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేసి ఆమెను, వారి తల్లిదండ్రులు రాఘవరెడ్డి-స్వరాజ్యలక్ష్మిలను అభినందించారు.

# మంత్రి ఆనం ఆత్మకూరుకు నేడు రాక



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మంగళవారం ఆత్మకూరులోని ఏపి బాలికల గురుకుల పాఠశాలను సందర్శించనున్నారు. ఈపాఠశాలకు చెందిన పలువురికి జ్వరాలు సోకడం, శనివారం మంత్రి రామనారాయణరెడ్డి జిల్లా కలెక్టర్, ఇతర వివిద శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించడం, జిల్లా, డివిజన్ యంత్రాంగం ఆత్మకూరుకు తరలివచ్చి చర్యలు తీసుకోవడం, ఆదివారం మంత్రి ఈ సంఘటనపై అధికారులతో సమీక్షించడం తెల్సిందే. మంగళవారం మంత్రి ఆనం స్వయంగా గురుకుల పాఠశాలను పరిశీలించనున్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో అన్ని విభాగాల వైద్యులతో ఆయన ప్రత్యేకంగా సమావేశం నిర్వహించనున్నారు.

## ప్రత్యేక పూజలు అందుకున్న గురప్ప స్వామి

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజ మూరులోని నడుమూరు నందు వేంచేసియున్న శ్రీ గురప్పస్వామి అంకాలమ్మ నాగవరపమ్మ దేవతలకు సోమవారం పురస్కరించుకుని ప్రత్యే క పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గురువారెడ్డి ఆధ్వర్యంలో ఉదయాన్నే స్వామివారికి అభిషేకాలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపించారు. భక్తులు ఉదయాన్నే ఆలయానికి చేరి స్వామివారిని దర్శించుకుని సహా కర్పూరం చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు తీర్థ ప్రసాదములు స్వీకరించి పునీతులయ్యారు.

## 18, 19న మండలస్థాయి క్రీడాపోటీలు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 18, 19వ తేదీల్లో క్రీడాపోటీలు జరుగుతాయని మండల విద్యాశాఖాధికారిణి సి.హెచ్.అనంతలక్ష్మి పేర్కొన్నారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈపోటీలను నిర్వహిస్తామని ఆమె తెలిపారు. ఈ క్రీడల్లో అండర్-14, అండర-17 బాలబాలికలు పాల్గొనాలన్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, యోగ, కార్యరమ్స్, అథ్లెటిక్స్ అంశాల్లో క్రీడా పోటీలు జరుగుతాయని ఆమె పేర్కొన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రవేటు, గురుకుల పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొనేలా అందరు ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్, కరస్పాండెంట్లు, వ్యాయామ ఉపాధ్యాయులు చొరవ చూపాలని, విద్యార్థులను ఈ క్రీడలకు ప్రోత్సహించి పాల్గొనేలా చూడాలని ఆమె కోరారు. విద్యార్థినీ, విద్యార్థులు క్రీడల్లో పాల్గొనేందుకు ముందుగానే రిజిస్ట్రేషన్ ఫారాలు అందజేయాలని అనంతలక్ష్మి కోరారు.

# ఎన్టీఆర్ సుజల పథకాన్ని సద్వినియోగం చేసుకోండి : కమిషనర్ వై.ఓ నందన్

**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలో ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ సుజల సురక్షిత తాగునీటి పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ వై.ఓ నందన్ సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సోమవారం నిర్వహించారు. కమిషనర్ వైఓ నందన్ పాల్గొని అర్జీదారుల నుంచి వినతి పత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్థానిక వెంకటేశ్వరపురం వేప దరువు పాత మున్సిపల్ కార్యాలయం ప్రాంగణాల ఏర్పాటు చేసి ఉన్న ఎన్టీఆర్ సుజల సురక్షిత త్రాగునీటి వాటర్ ప్లాంట్ల నుంచి సేకరించి నగరవ్యాప్తంగా 15 రిమోట్ డిస్పెన్సరీ కేంద్రాల ద్వారా ప్రతిరోజు సుమారు మూడు లక్షల లీటర్ల సురక్షిత తాగునీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. తాగునీటి కేంద్రాలలో వివరాలను నమోదు చేసుకున్న మొదట 100 మంది లబ్ధిదారులకు 50 రూపాయల రిజిస్ట్రేషన్, 20 రూపాయల రీఛార్జ్ ఉచితంగా అందజేస్తున్నట్లు కమిషనర్ ప్రకటించారు. ఎన్టీఆర్ సుజల పథకం ద్వారా కేవలం రెండు రూపాయలకే 20 లీటర్ల సురక్షిత తాగునీటిని పొందే అవకాశాన్ని పౌరులందరూ సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ఆకాంక్షించారు. విభాగాల వారీగా అకౌంట్స్-3, ఇంజనీరింగ్-4,



రెవెన్యూ-6, పబ్లిక్ హెల్త్-4, హౌసింగ్-14, టౌన్ ప్లానింగ్-14, మొత్తం-45 విజ్ఞప్తులను ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కమిషనర్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రామ్ మోహన్ రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కనకాద్రి, సిటీ ప్లానర్ హిమబిందు, మేనేజర్ రాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.